# మనుషులు - మరలు

శ్రీ పాలడుగు వేంకటేశ్వరరావు

తల్చుకుంటే చిత్రమనిపిస్తుంది ఇప్పుడు !

చిన్నప్పుడు నాకు భలే కలలు వచ్చేవి.

రంయిమని ఆకాశంలోకి ఎగిరినట్లు, తెల్లని మబ్బుల్ని దాటుకుంటు వేగంగా పోతువున్నట్టు, కింద నున్న భూమి మీది ఇళ్లు, చెట్లు చిన చిన్న చీమల్లా అవుపించినట్లు — అలా అలా తేలిపోతూ -- పోతూ వున్నట్లుండి ఒక్కసారిగా క్రింద పడిపోతు వున్నట్లు అన్పించేది. భయంతో గట్టిగా కళ్లు మూసుకునే వాడ్ని. అంతలోనే మెలకువ వచ్చేది. మంచం మీద గజ గజ వణుకుతూ ఒళ్లంతా చమట్లు పట్టి నేను మిగిలిపొయ్యేవాణ్ని. రెండు గ్లాసులు మంచినీళ్లు తాగి మరల పడుకొనేవాడ్ని.

అదంతా జాపకం వచ్చి నవ్వు వచ్చింది నాకు. అప్పడే సూర్యు డస్తమిస్తున్నాడు. నా ప్రక్కనే నిలబడి కొండల్ని, కింది లోయల్ని, పచ్చటి చెట్లనీ, అటు ప్రక్కగా తరంగాలతో ఎగిరిపడ్తూవున్న సముద్రాన్ని చూస్తువున్న నా భార్య నన్ను గమనించి 'ఏమిటి నవ్వుతున్నారు ?' అని అడిగింది గాభరాగా.

'ఏం లేదు వూరికినె' అన్నాను.

ఆ సమాధానం ఆవిడ్ని సంతృప్తి పరచనట్టు ఆమె చూపులు తెలిపాయి. నా వంక అనుమానంగా చూస్తూ 'సర్లెండి రండి. ఫలహారం చేద్దాం! అని ప్రక్కగావున్న చదునయిన ప్రదేశం వంక నడిచింది.

ఇప్పుడు నా వయసు అరవై సంవత్సరాలు. నా భార్యకి యాభైయ్యయిదు నేను యూనివర్సిటీలో ఫిజిక్సు ప్రొఫెసర్‌గా పనిచేసి రిటయిరయ్యాను. మాకు ఒక అమ్మాయి. ఆమె ఎం. ఏ పూర్తిచేసి యూనివర్సిటీలో లెక్చరరుగా పనిచేస్తున్నది. ఆమెకి ఇంకా విహహం కాలేదు. కాని మాకు తెలుసు. మా అమ్మాయి వనజ ఇంగ్లీషు ప్రొఫెసరు రామారావు కొడుకు కృష్ణారావుని ప్రేమించింది. అతనూ మా అమ్మాయిని ఇష్టపడ్డాడు. వారు కోరిన కట్నం కానుకలు ఇవ్వటానికి మేము సిద్ధపడ్డాము. కాని మా ప్రయత్నాలకి ప్రొఫెసరు రామారావు అడ్డుపడ్డాడు. ఏ కారణంవల్లనో అతను మా సంబంధానికి ఇష్టపడటం లేదు. అది మాకు ఈ వయసులో భరించలేని విచారానికి హేతువయింది. నిరాశతో వనజ చిక్కి సగమయింది. కృష్ణారావు భగ్న హృదయుడై పై చదువుల మిషమీద మద్రాసులో వుంటున్నాడు. కాని మాకు తెలుసు. వారిద్దరిమధ్యా ఈ నాటికీ ఉత్తరాలు నడుస్తూ వున్నాయి. వారి ప్రేమ ఫలిస్తుందా అన్నది మాకు సమాధానం దొరకని ప్రశ్నే అయింది.

ఆ యువకుల ప్రేమని సఫలం చెయ్యటాన్కి ఇంకా నేను ప్రయత్నిస్తు వున్నాను. కాని ఏ కారణం వలన ప్రొఫెసర్ రామారావు మా సంబంధం గురించి ముభావం చూపిస్తు వున్నాడో—అదే కొరుకుడు పడటం లేదు, నాకు.

చెప్పద్దూ! ఈ మధ్యనే ఒక చిత్రం జరిగింది.

ఏడాది క్రితమే ప్రొఫెసర్ షిప్పునుంచి రిటయిరయినా నేను పుస్తకాన్ని వదలలేదు. నా 'రిసర్చి'ని సడలనీయలేదు. న్యూటన్ మహాశయుని గురుత్వాకర్షణ సిద్ధాంతంమీద రాత్రింబవళ్లు నిర్విరామంగా కృషి చేసాను నేను.

ఏదయినా ఒక పద్ధతివలన ఆ గురుత్వాకర్షణ సిద్ధాంతాన్ని భగ్నం చేయటమే జరిగితే—అప్పుడు మనిషి పక్షిలాగ ఎగరటానికి—సునాయాసంగా ప్రయాణించటానికి వీలుపడుతుంది. అదే నా ప్రయత్నం. కొన్ని సంవత్సరాల కృషి తర్వాత నేను నా ప్రయత్నంలో సఫలీకృతుణ్ణయాను! ఇందులో పెద్ద విశేషం లేదు. ఒక చిన్నమర. అగ్గి పెట్టె అంతది. అందులో

వలయాకారంగా చిన్న మాగ్నెట్‌లని అమర్చాను. అవి విరుద్ధ మార్గాలగుండా పరస్పరం వికర్షించుకొనే టట్లు చేసాను. దానికి ఒక ప్రక్కన చిన్నమరమేకు అమర్చాను. ఆ మేకుని తిప్పి లోపలికి బయటికి నడు పటం ద్వారా ఆ, వికర్షణ శక్తిని పూర్తిగా కంట్రోలు చేసే ఏర్పాటు చేసాను. అద్భుతమయిన శక్తి సృష్టింప బడింది!

నిజం!

నా కల నిజమయింది!

అత్యద్భుతమయిన సంగతి ఇది నిజంగా.

ఈ విషయం నా భార్యకి చెప్పాను, అప్పడే కాని—అంతా విని కృంగిపోయి ఆమె ఏడ్చింది.

'పిచ్చిదానా! ఎందుకు ఏడుపు? ఎంత గొప్ప ఇన్వెన్షన్! ఎఫ్. ఆర్. ఎస్. ఖాయం. ఇక మన పేరు దశదిశలా మారుమ్రోగుతుంది. కావలసినంత డబ్బు' అన్నాను, నా కంగారును కప్పిపెట్టుకుంటు.

ఆమె మరింత ఏడ్చింది. ఏడ్చి—

'అదేనండి. నా విచారం. ఇప్పటివరకు మీరు నా భర్త. ఇక ఈ సంగతి గనుక ప్రపంచానికి వెల్ల డైతే మిమ్మల్ని ఆకాశానికి ఎత్తివేస్తారు. శాస్త్ర జ్ఞుల సమావేశాలకి పిలుస్తారు. ఉపన్యాసాలు ఇప్పి స్తారు. సన్మానాలు చేస్తారు. ఇక మీరు నాకు దక్కరు. దక్కనీయదు ప్రపంచం.' అని కళ్లు వత్తుకుంది.

నేను కరిగి నీరయాను. దాదాపు నలభై యేళ్ళుగా అనుకూలమైన దాంపత్యం నాతో నెఱపిం దామె. 'చెప్పు. నువ్వు ఏంచెయ్యమంటే అది చేస్తాను. నాకు నీకంటె ఎవరూ ఏమీ ఎక్కువ కాదు.' అని ఓదార్చాను ఆమెని.

ఆమె నాచేత చేతిలో చెయ్యి వేయించుకుంది.

నానుంచి మాట తీసుకుంది.

'ఈ సంగతి ఎవరికీ తెలీనీయకండి. మీకు పుణ్యం వుంటుంది. ఏది ఏమయినా నేను లెక్క చెయ్యను. నాకు మీరు కావాలి. మీ శాస్త్రం వద్దు. మీ సంపాదన వద్దు. పేరు ప్రఖ్యాతులు వద్దు. నాకు మీరు మాత్రమే కావాలి' అంది.

నేను ఆశ్చర్యపోయాను.

'మరి ఇంత కృషిచేసి మహత్తరమయిన విషయం కనిపెట్టి దీన్ని వ్యర్థంగా నశించిపోనీయాల్సిందేనా? ఉపయోగం ఏమిటి?' అన్నాను.

'కావాలంటే మీవరకు మీరు ఏమిచేసి గొడవపడినా నాకు బాధ లేదు. కాని ఈ విషయం మరో నర మానవుడికి తెలియటానికి వీలులేదు. అంతే' అంది ఖండితంగా. అని నన్ను కట్టిపడేసింది.

నేను కనిపెట్టిన ఈ విషయాన్ని ఒక మరగా అమర్చి అగ్గిపెట్టెవంటి చట్రంలో ఇమిడ్చాను. దాన్ని బయటికి కనపడనిస్తే ఎవరయినా ఏమిటని అడిగే ప్రమాదం వుంది. అందుకని మా ఇంట్లో ఒక పాత సంచివుంటే అందులో ఆ మరని అమర్చి ఆ సంచిని బుజానికి తగిలించుకున్నాను. స్క్రూమేకుని సరియైన స్థానంలో వుంచి ప్రయోగాలు చేసాను. మేకుని లోనికి బయటికి తిప్పించి పరీక్షలు చేసాను. నా కాళ్లు తేలి పోతున్నాయి.

బరువే అన్పించటంలేదు.

ఎంత నడిచినా ఆయాసం లేదు.

మైళ్లకి మైళ్లు పరుగెత్తినా ఏమీ అన్పిం చటంలేదు. అలసటే లేదు.

స్క్రూని మరొక చుట్టు త్రిప్పాను.

గాలిలోకి తేలిపోతున్నాను.

పక్షిలా ఎగుర గలుగుతున్నాను. గురుత్వాకర్ష ణని జయించాను!

రాత్రుళ్లు ఎవరూ చూడకుండా—నా 'మర'తో అద్భుతమయిన ప్రయోగాలు చేసాను. ఎంతో ఆనం దంగా అన్పించింది! నిజంగా ఎంత అద్భుతమయిన సంగతిది! నా వ్యవహారం చూసి నా భార్య సణగటం మొదలుపెట్టింది.

ఇక లాభం లేదని ఆమెకోసం మరొక మరని తయారుచేసాను. చాలా సింపుల్. అయినా అద్భుత మయిన శక్తి కలిగినది ఈ మర. చివరికి ఆ పిచ్చి ఆమెకే అంటింది!

ఇంకొక పాత సంచిని తనూ తన బుజానికి బిగించుకుంది. అందులో ఆ మరని అమర్చింది.

ఆమె బుజానవున్న మరయొక్క స్క్రూని నేను తిప్పాలి.

నా బుజానవున్న స్క్రూని ఆమె సరిచేయాలి.

ఎవరి మర వారు సరిచూసుకోవటానికి చేతులు అందలేదు. అది దాని వైలక్షణ్యం! జీవితంలోలా ఈ సాహస కార్యంలో కూడా ఒకరికొకరం తోడు.

కొత్త పిచ్చవాళ్ళవలె మాకు ప్రొద్దు తెలియ లేదు. ప్రొద్దుటే అన్నం తిని కాస్త టిఫిను మూట కట్టుకుని ఇద్దరం కలిసి ముడగుర్లోవ, యారాడకొండ డాల్ఫిన్సునోసు అన్నీ తిరిగి చీకటిపడ్డాక ఇల్లు చేరే వారము.

మమ్మల్నిచూసి మా కాలనీలోవాళ్ళు కళ్ళు ఇంతచేసుకుని అదొకరకంగా చూసేవారు. ఈ విషయం మా వనజకి కూడ తెలీసీలేదు మేము! వాళ్ళ ఆశ్చర్యం — అది ఎందుకో మాకు అర్థంకాదు.

అయినా వాళ్లనిచూసి మాకు నవ్వు వచ్చేది.

మేము ఎంతటి శక్తిమంతులమో వాళ్ళకి తెలియదు గదా!

ముఖ్యంగా ప్రొఫెసర్ రామారావు నన్నుచూసి మొహం చిట్లించేవాడు. రోజంతా తెగతిరిగి నా తల అస్తవ్యస్తంగా వుండేది. మొహం జిడ్డుగారుతు వుండేది. బట్టల్నుగురించి అంత శ్రద్ధ తీసుకొనే వాడ్నిగాను నేను. ఈ మధ్య అంతగా క్లబ్బుకి వెళ్ళటం తగ్గించాను. ఏమో! దానిగురించి ఎవరయినా అడిగితే! అప్రయత్నంగా నా రహస్యం నేను బయటపెడితే...! మా యావిడ వూరుకోదు. అందుకే వీలయినంత వరకు నా ప్రపంచంనుంచి బయటి ప్రపంచాన్ని వేరు చేసాను.

ఎంతసేపూ నాకు ఇదే ధ్యాసయింది.

తలుపులన్నీవేసి—రెండు మరల్నీ డిస్‌మాంటిల్ చేయటం ఆయిలింగు చేయటం, మరల సక్రమంగా కూర్చి కండిషన్‌లో వుంచటం, స్క్రూలు సరిగా పని చేస్తున్నాయో లేదో చూసుకోవటం. రాత్రుళ్ళు వాట్నే ధరించి రకరకాల ప్రయోగాలు చెయ్యటం పగళ్ళు నిర్జన ప్రదేశాల్లో కాలక్షేపం!

ఈ సంవత్సరకాలంగా ఇదే లోకమయింది నాకు. నాకంటె పిచ్చిదిగా తయారయింది ఆవిడ.

ఒక సోషల్ గాథరింగు, ఒక ఫంక్షను, ఒక మీటింగు, ఒక ఫ్రెండ్స్‌తో బ్రిడ్జిఆట, ఒక డిన్నర్‌కి వెళ్ళటం— ఏంలేదు పాత అలవాట్లన్నీ పోయేయి. ఆలోచించుకుంటే నాకే ఆశ్చర్యమన్పిస్తుంది. నేనెంత మారిపోయాను! నేను ఏమయిపోతాను?! ఏమో!

ఎంతో శ్రమించి, ప్రకృతికి విరుద్ధంగా ఒక శక్తిని సృష్టించి— దాన్నిగురించి ప్రపంచానికి తెలియ కుండా ఎంతకాలం దాచి వుంచగలను?

'ఏమిటి? ఆలోచన? రండి. ఫలహారానికి' అంటూ మరల పిలిచింది నా భార్య.

ఆలోచనల్నుంచి బయటపడి ఆమెదగ్గరకి నడి చాను. ఆమె బుజంనుంచి తన సంచీ తీసింది.

అందులోంచి బ్రెడ్‌జామ్, అరటిపళ్ళుతీసి నాప్ కిన్ పరిచి ఎదుటపెట్టింది. తన బుజంమీది సంచినితీసి ప్రక్కనపెట్టింది. అందులో ఆ మర వుండింది. కబుర్లు చెప్పుకుంటూ ఫలహారం కానిచ్చాము ఇద్దరమూ. నా భార్య ఎందుకో విచారంగా వుంది.

'ఎందుకు విచారం?' అన్నాను.

'ఏం లేదు. మీారు కనిపెట్టిన ఈ మర సహాయంవల్ల సునాయాసంగా కొండలు ఎక్కగల్గు తున్నాము. ఆకాశంలో ఎగుర గల్గుతున్నాము. చిత్ర విచిత్రమయిన మానవ సాధ్యంగాని పన్లు చెయ్యగల్గు తున్నాము. గొప్ప విశేషమే. కాని వనజని చూసారా? తను బెంగపెట్టుకుని రోజు రోజు క్షీణించి పోతు వుంది. మీారు ప్రొఫెసర్ రామారావుకి నచ్చచెప్పి పెళ్లికి వప్పించలేరా? ఇంత చేసినవారు ఆ చిన్న పని చెయ్యలేరా? అని' అంది సాలోచగా.

'అదే ఆలోచిస్తున్నాను. కాని ఆ పెద్దమనిషి ఇటీవల నన్ను చూడగానే మొహం చిట్లిస్తున్నాడు... నా వైపు క్రూరంగా చూస్తున్నాడు'

'ఏం? మీా మొహాన ఆయనకి గబ్బిలాలు కన్పడుతున్నాయా?'

'అదే అర్థం కావటం లేదు. మే మిద్దరం మంచి మిత్రులమే. కాని ఇటీవల అతను నామీాద అకారణంగా వైరం పూనాడు...'

'ఏమయినాసరే. అమ్మాయి పెళ్లి ఆగటానికి వీలులేదు. సామదాన భేదోపాయాల ఆ పని కానివ్వాలి' అంది ఖండితంగా.

'అవును' అన్నాను.

ఇంతలో మా ఆవిడ కెవ్వున కేకవేసింది.

'ఏమయింది? ఏమిటి? అంటు తత్తర పడ్డాను.

'అదుగో అటుచూడండి' అంటు ఆకాశం వయిపు చూపించింది ఆమె. చూశాను.

ఆకాశంలో ఎత్తుగా పైకి తేలిపోతూ—అప్పటి వరకు ఆమె ధరించిన మరతోవున్న ఆ సంచీ చిన్నగా అవుపిస్తూంది.

'అదేమిటి? సంచిని తీసి కింద పెట్టేటప్పుడు స్క్రూని తిప్పలేదా?' అన్నాను.

'ఊహు. మరిచిపోయాను.' అంది కంగారు పడ్తు.

ఆ సంచిలోని స్క్రూ ఆమె బరువుకి అనుగుణంగా తిప్పివుంది. సంచిని తననుంచి వేరు చేసేటప్పుడు ఆమె ఆ స్క్రూని సరిచేసి వుండాల్సింది. ఆమె మరిచిపోయి ఆ పనిచేసి వుండలేదు. అందువలన మరపనిచేసి సంచిని ఎగరవేసుకుపోయింది! బరువు తగ్గటంవలన.

'ఇప్పుడు ఎట్లా?' అంది ఆవిడ!

'ఇక ఆ సంచిని అందుకొనే వుపాయం లేదా?' అంది మరల.

'ఊహు. లాభంలేదు. అందుకు ప్రయత్నించి ఫలితం లేదు. సంచీ చాల ఎత్తుకు ఎగిరిపోయింది' అన్నాను.

ఆవిడ బిక్కమొహం వేసింది.

మేము శిఖరాగ్రాన వున్నాము. మర సహాయం లేకుండా ఆవిడ స్వయంగా కిందికి దిగటం కష్టభూయిష్టమయిన పని.

'ఏం చేస్తాం చెప్పండి?' అంటు ఆవిడ బిక్కమొహం వేసింది.

అప్పుడే చీకటిపడ్తువుంది.

పట్నంలో దీపాలు వెలిగాయి.

నేను ఒక వుపాయం ఆలోచించాను.

ఆవిడని సామాన్లు సర్దమన్నాను.

నా బుజానికివున్న సంచిలోని మరని మా ఇద్దరి బరువుకి సరిపడా రెండుసార్లు తిప్పమన్నాను. ఆవిడ ఆపని చేసింది. చేసి నన్ను గట్టిగా పట్టుకుంది. ఆవిడ నడుంచుట్టూ నాచేయి బిగించాను.

మేము మెల్లగా గాలిలోతేలి కిందికి దిగసాగేము.

చల్లనిగాలి మెల్లగా వీస్తూవుంది.

అప్పటికే చీకటి దట్టంగా అలుముకుంది. మమ్మల్ని ఎవరూ గమనించే అవకాశంలేదు.

మేము మా ఇంటిదగ్గరికి వచ్చేసరికి ఇంట్లో దీపాలు వెలుగుతున్నాయి. నన్ను గుమ్మందగ్గరనే వదిలి— స్క్రూని నా బరువుకి సరిపడేట్టు త్రిప్పకుండానే— వనజని చూడాలన్న ఆదుర్దాతో మా యావిడ గబగబ లోనికి వెళ్లిపోయింది నన్ను విడిపించుకుని.

అంతలోనే— విచిత్రంగా నేను పైకి తేలిపోతున్నాను!

నా కాళ్ళు భూమినించి క్రమంగా విడివడ్డాయి.

వెనుక బుజానవున్న మరస్క్రూని అందుకోటానికి విఫలప్రయత్నం చేసాను. అది అందలేదు. ఈలోగానే—

అడుగు.

రెండడుగులు.

నాలుగడుగులు.

ఇట్లా పదిఅడుగులవరకు నేను గాలిలో తేలిపోయాను.

గాలివాలున సాగిపోతున్నాను.

నిస్సహాయస్థితి!

అదృష్టవశాత్తు అంతా చీకటిగా వుంది. గాలిలో తేల్తువున్న గాలివాలున కొట్టుకుపోతువున్న నన్ను ఎవరూ గమనించలేదు.

నాకు ఏమవుతుంది? భూమిని అందుకోగలనా?

గాలి తూర్పుకి సాగుతూంది.

ఆ వాలున అలా అలా పోయి సముద్రంలోకి నడిస్తే నా గతి ఏంగాను?

నిస్సహాయంగా నా స్థితిని భగవంతునికి వదిలి పెట్టి అలాగే తేలిపోయాను. అదృష్టవశాత్తు నేను పది అడుగులకంటె ఎక్కువ పైకి పోలేదు. బహుశా గాలి సాంద్రత నన్ను కాపాడి వుండాలి.

కాని...ఏమవుతుంది చివరికి? ఏమో!

బీచిలో లైట్లు వెలుగుతున్నాయి,

సముద్రంలో రేవు బయట కొన్ని ఓడలు దీపాలతో నిలిచివున్నాయి.

అలా అలా సముద్రంలోకి పోతువున్నాను.

ఇక నా పని అయిపోయింది. నన్ను భగవంతుడు కూడ రక్షించలేడు కాని—అంతలో—

నా అదృష్టం పండి గాలివాలు మారింది.

మరల భూమిమీదికి కొట్టుకువచ్చాను.

నా కింద—

సముద్రపు ఒడ్డున భూమిమీద క్లబ్బు బిల్డింగుని నేను గుర్తించాను.

అక్కడ బారులు తీరిన కారులు నిల్చివున్నయి.

ఆ సమయంలో నేను అరిస్తే—ఎవరయినా గమనించవచ్చు గాని నన్ను ఏ భూతమో అనుకుని గొడవచేసే ప్రమాదం వుంది. పిచ్చప్రజ రాళ్ళు విసిరి నన్ను చంపివెయ్యనూ అవకాశం వుంది.

మెల్లమెల్లగా గాలి నన్ను క్లబ్బు రోడ్డువెంట తోసుకు పోసాగింది.

అంతలో—

కిందనించి రెండు కంఠస్వరాలు నాకు విన్పించినయి.

ఆ ఇద్దరు వ్యక్తులు నాకు పరిచితులే. ఆ స్వరాలు నే నెరిగినవే. వాళ్ళు ఏదో విషయం గురించి మాట్లాడుకుంటు వెళ్తున్నారు.

అందులో ఒకరు ప్రొఫెసర్ రామారావు.

రెండవవారు పి. డి. పున్నారావు.

పున్నారావు చెప్తున్నాడు రామారావు వూకొట్తున్నాడు. వినగా—ఆ విషయం నాకు సంబంధించినదే అన్పించింది.

ఒక పదిరోజులక్రితం పున్నారావుకి నాకు వాగ్యుద్ధం జరిగింది. పున్నారావు బలిష్ఠుడు. బాగా వ్యాయామం చేసిన శరీరం. ఆ మధ్య డెహ్రాడూన్ వెళ్లి మౌంటెనీరింగ్‌లో శిక్షణ పొంది వచ్చాడు.

క్లబ్బులో నలుగుర్నీ చేర్చి తన పర్వతారోహణ్ణి గురించి గప్పాలు కొట్తు వున్నాడు. చిలిపిగా నేను అతన్ని ఎదుర్కొని 'అదెంత ఘనకార్యం' అన్నాను. పున్నారావు అఫెండయి ఛాలెంజి చేసాడు. నేను సరేనన్నాను.

మర్నాడుదయమే డాల్ఫిన్స్‌నోస్ ఎక్కటాన్కి పందెం వేసుకున్నాము మేము. అప్పుడు ప్రొఫెసర్ రామారావు ఎగ్జామినర్‌గా హైద్రాబాద్ వెళ్లి వున్నాడు.

ఆ ఉదయమే నేను నా సంచిని బుజాన తగిలించుకుని అందులో—తగినట్టుగ ఫ్లాస్కు తిప్పి—మరని—మా ఆవిడ పెట్టగా హుషారుగా వెళ్లాను.

పందెం మొదలయింది.

నేను హుషారుగా చెంగుచెంగున ముందు పరిగెట్టాను బండల్ని దాటుతు పైకి, పైపైకి. 'ఓయ్! పడతావు. జాగ్రత్త' అంటు పున్నారావు హెచ్చరిస్తూనే వున్నాడు. అయినా నాకేం భయం? పున్నారావు చమట్లు కక్కుకుంటు సగం దూరం వచ్చేసరికి నేను లైట్ హవుస్ చేరేను. అరగంట తర్వాత చమట్లు కక్కుతూ అక్కడికి చేరిన పున్నారావు చమట తుడ్చుకుంటు 'అంత తొందర పనికిరాదని, ఏమయినా అయితే దారుణమయిన ప్రమాదం జరగవచ్చునని నన్ను తిట్టాడు. నేను నవ్వి వూరుకున్నాను.

'కనీసం దిగేటప్పుడైనా జాగ్రత్తగా వుండు' అని హెచ్చరించాడు పున్నారావు. కాని దిగేటప్పుడు మరింత హుషారుగా చెంగుచెంగున దిగుతు గెంతుతు

పది నిముషాలలో కిందికి వచ్చేసాను. గంట తర్వాత అక్కడికి వచ్చిన పున్నారావు కళ్లింత చేసుకుని నా వంక చిత్రంగా చూసాడు—ఇప్పుడు—ఆ సంఘటన గురించే ప్రొఫెసర్ రామారావుకి వివరిస్తున్నాడు పున్నారావు.

'చాల చిత్రంగా వుంది. మనిషినిచూస్తే బక్కపీనుగులాగుంటాడు. అటువంటివాడు సర్కసు గుర్రంలా పరిగెత్తాడు. కొంచంకూడ అలిసిపోయి నటు కన్పించలేదు. నా మటుకు నాకు అతివిచిత్రంగా వుంది. అతనిలో ఏ వయినా అతీతశక్తి వుందా అన్పిం చింది!' అన్నాడు పున్నారావు.

'అవును. అతను ఈ మధ్యన మరీ పిచ్చి వాడి వలె తయారయాడు. బుజానసంచి వుంటుంది. అందులో ఏముంటుందో భగవంతుడికే తెలియాలి. సొసైటీని వదిలిపెట్టాడు. పిచ్చిపిచ్చిగా భార్యతో కొండలు, అడవులు తిరగటం ప్రారంభించాడు. ఆ నడకే చాల చిత్రంగా మారిపోయింది. క్లబ్బు లేదు. స్నేహితులు లేరు. ఏమీ లేదు. అసలు అతనికి పిచ్చి పట్టినట్టు నా అనుమానం. అందుకే—మావాడు కృష్ణారావు వాళ్లమ్మాయి వనజని చేసుకుంటానంటే ససేమిరా కూడదన్నాను. ఆ పిచ్చివాడా నా వియ్యం కుడు?! దేనికయినా సమానత్వం వుండాలంటారు.'—రామారావు మాటలు చెళ్లున నా చెంపమీద తగిలాయి.

నేను పిచ్చివాడ్ని అని అనుకుంటున్నారా వీళ్లు? ఎంత పిచ్చిఆలోచన!

అదే—మేము అల్లారుముద్దుగా పెంచుకున్న వనజ పెళ్లికి ఆటంకమయిందా?

ఎంత చిత్రం! అసలు సంగతి వాళ్లకేం తెల్సు?

అంతలో వాళ్లు దాటిపోయారు.

నేను తేలి తేలి ఎటో కొట్టుకు పోయాను.

గాలి వుధృతం హెచ్చింది.

కర్మగాలి నేను ఏ ఎలక్ట్రిక్ స్తంభానికో, లేక చెట్టుకో, లేక ఎత్తయిన బిల్డింగుకో ఢీకొనటమే జరిగితే—ఇక కథ వుండదు.

పట్నం నిర్మానుష్యంగా వుంది.

బాగా ప్రొద్దుపోయింది.

మరి ఏమిటి నా గతి?!

ఏదో ఒకటి త్వరగా అయితే బావుండును.

కాని—

అంతలో నా కింద చీకట్లో ఏదో ఆకారం కదిలింది.

'ఇదుగో! మీరేనా?,' గద్గదపూరితమైన గొంతు. ఆ గొంతు నేను గుర్తించాను. అది నా భార్యది! 'ఆఁ. నేనే.' అన్నాను.

'అయ్యో! నా మతిపోయి, మిమ్మల్ని అలాగే వదిలి వెళ్లిపోయాను. నన్ను క్షమించండి. ఇందాక ట్నుంచి మీకోసం తెగవెతుకుతున్నాను...'

'సర్లె. ఇప్పుడు నన్ను కిందికిదించే వుపాయం చూడు' అన్నాను.

ఆవిడ పావుగంటసేపు నానాతిప్పలు పడి ఒక గడకర్ర సంపాదించి పైకి చాపింది. సర్కసుఫీటు చేసినంత శ్రమపడి, వంగి నేను దాన్ని అందుకున్నాను. వెంటనే ఆవిడ నన్ను కిందికి లాగి నా బుజంమీది మరయొక్క స్క్రూని సరిగా తిప్పింది!

అమ్మయ్య! నాకు ఇంకా ఈ భూమిమీద నూకలు వున్నాయి! అదే పది వేలు! ఒకర్నొకరం కావిలించుకుని ఆనందబాష్పాలు రాల్చాము.

చెయ్యి చెయ్యి పట్టుకుని వుషారుగా ఇంటికి వెళ్లాము. తోవలో ఆమెకి- ప్రొఫెసర్ రామారావు నన్ను గురించి ఏమనుకుంటున్నదీ, వనజ పెళ్లికి ఆటంకమయి ఇంతకాలంగా మమ్మల్ని విచారంలో ముంచివేసిన సంగతి ఏమయినదీ—ఆమెకి వివరించి చెప్పాను. ఆమె ఆశ్చర్యపడింది! త్వరలో ఏదో సంగతి తేల్చెయ్యాలని నిర్ణయించుకొన్నాము.

మా యావిడ సలహా మీద మర్నాడుదయమే నేను స్నానంచేసి నీట్‌గా డ్రస్సయి ప్రొఫెసర్ రామా రావు ఇంటికి వెళ్లాను.

అతనికి నేను కనిపెట్టిన 'మర' గురించి వివ రించాను. ఇంతకాలంగా అతను నన్ను పిచ్చిమనిషిగా పరిగణించటానికి గల కారణం వివరించాను.

అంతా విని 'నేను నమ్మలేను' అన్నాడు అతను.

'సర్లె. ఋజువు చేస్తాను' అని ఆ రాత్రే రామారావుని మా ఇంటికి ఆహ్వానించాను. భోజనాలయి బాగా ప్రొద్దుపోయేక నా సంచిలో పదిలంగా దాచి వుంచిన 'మర'ని బయటికి తీసి అతనికి వివరించాను. రామారావు స్థూలకాయుడు. అతని వీపుకి ఆ సంచి బిగించి, అందులో స్క్రూని సరిగా తిప్పి 'మర'ని తగిలించింది నా భార్య.

అప్పుడు నా సూచనమీద రామారావు 'లాంగ్ జంప్' చేసాడు— పదడుగులు దూకాడు. హై జంప్ చేసాడు— పదడుగులు సునాయాసంగా గెంతాడు. పెద్దపెద్ద బరువులు అలవోకగా లేపాడు. బలాఢ్యుని వలె ఘనకార్యాలు చేసాడు.

అంతా అయాక 'చిత్రంగా వుందయ్యా. అయామ్ సారీ! ఇంతకాలం నేను నీ గురించి మరొక విధంగా వూహించి అపోహపడ్డాను.' అని విచారించాడు. ప్రొఫెసర్ రామారావు.

'అయితే మా సంబంధానికి ఒప్పుకున్నట్లేనా?' అంటూ నిగ్గదీసింది మా యావిడ వెంటనే, అని పిల్లలిద్దరూ ఏ రకంగా బాధపడ్తున్నారో చెప్పింది.

'అమ్మాయి! ఇంకా సందేహమా? డామ్ షూర్! మై ఫ్రండ్! నువ్వు నిజంగా జీనియస్సువోయ్! రేపే కాన్ఫరెన్సు ఏర్పాటుచేసి ఈ విషయం ప్రపంచ వైజ్ఞానికుల దృష్టికి తీసుకెళ్ళి...' రామారావు మాటలు పూర్తిగాకుండానే మా యావిడ అడ్డుపడింది.

'ఆగండి మహాశయా! అంతవరకు వద్దు. ఇప్పటికే ఇంతవరకూ రానిచ్చి ఇంత రామాయణం అయింది. ఇకవద్దు. ఏదో ఆ పెళ్ళిచేసి మమ్మల్ని కృష్ణారామా అంటూ బ్రతకనీయండి. చాలు. మీకు మీ వైజ్ఞానిక ప్రపంచానికి లక్ష ధన్యవాదాలు' అంటూ ఆయన వీపునించి ఆ సంచితీసి, మరని బయటికిలాగి నేలకేసి కొట్టింది గట్టిగా.

అది పగిలి సవాలక్ష ముక్కలయింది.

రామారావు తెల్లపోయి చూస్తూ వుండిపోయాడు.

నేను ఆలోచనలో పడ్డాను.

ప్రకృతికి వ్యతిరేకంగా నడవటానికి ప్రయత్నించటం మనిషికి కష్టసాధ్యమే కావచ్చును; కాని ఆ స్థితిలో మనిషి మనుగడ కొనసాగించటం యెంత ప్రమాద భరితమూ! నా ఒడలు గగుర్పొడిచింది!

తల్చుకుంటే మరల నేను అటువంటి 'మర'లను వెయ్యింటివి సృష్టించగలను — కాని ఇప్పుడిక ఆ పని నావలన అవుతుందా అని!

(అంకితం: స్టాక్టన్ జీనియస్సుకి)

